'రచన' మాసపత్రిక – జూన్ 1992

# కథా ప్రహేళిక -6

# అద్వైతం

రాజు వెళ్ళిపోయాడు.

స్వేచ్ఛ మిగిలింది.

ఆ ఇద్దరి మధ్యనా ఉన్న నేను తలుపులు మూసి వచ్చాను.

స్వేచ్ఛ ఏదో విదేశీ ఇంగ్లీషు మాగజైన్ తిరగేస్తోంది.

దాని కెదురుగా సోఫాలో కూలబడి అలసటగా కళ్ళుమూసుకున్నాను.

"ఎజాక్యులేషన్ నా బర్త్‌రైట్" అంది స్వేచ్ఛ. ఆ గొంతులో నిబ్బరం లేదు. బింకం ఉంది. నేనోమారు కళ్ళు విప్పి చూశాను. అది ఆ మాగజైన్‌లోంచి చదివిందా – ఆ మాట? నాతో అందా?

దానిని పరిశీలించాను.

ఎత్తు కావటం వల్ల లావు కవరవుతోంది. ముఖంలో నిగారింపు ఉంది. మేకప్ –

అంతకుముందు సంఘటనలవల్ల - చెదిరి పోయింది. అయినా వయసు తగ్గించి చూపుతోంది. నలభై దానికీ, నాకూనూ!

లక్ష్మీదేవి నగరంలోని మనుషుల్లో - ఆమే గుర్తువస్తోంది! కనీసం పదేళ్ళయినా మా కన్నా చిన్నదయిఉంటుంది! చేతిని ఓ పిల్లా, చంకలో ఓ పిల్లా వేలాడుతున్నారు. వలవలా ఏడుస్తోంది. తన యింటిని అల్లరి మూకలు వచ్చి ఎలా కొల్లగొట్టిందీ, ఎలా కూల్చేసిందీ చెపుతోంది. ఫోటోలు తీసుకున్న వాళ్ళు తీసుకుంటున్నారు. రాసుకుంటున్న వాళ్ళు రాసుకుంటున్నారు. తన కెమెరాలో ఆ మొహం, ఆ దుఃఖం భద్రంగా ఉంది.

'కావేరి నీళ్ళని మద్రాసు కిమ్మని నేనన్నానా? నా భర్త యిమ్మన్నాడా? మా వీధి కుళాయిల్లోకి కావాల్సిన నీళ్ళను మరొకరికిచ్చెయ్యమని మేం అంటామా?' అంటున్నది ఆమె. ఆ దృశ్యాలను ఫోటోలు తీయటానికి ఎంత అల్లరి! అక్కడ బూడిద కుప్పలు! పోలీసులు! గుంపులు!

స్వేచ్ఛను చూస్తున్నా మనసు దాని మీద నిలవటం లేదు.

"ఏంటలా చూస్తున్నావ్?" - మేగజైన్‌ని పక్కన పడేసింది.

సిగరెట్ ఆర్పి ఆష్ట్రేలో వేసాను. కత్తిరించుకున్న జుత్తు వేళ్ళతో దువ్వుకున్నాను. మొహం జిడ్డుగా ఉంది. శరీరం అలసట తెలుస్తుంది.

"ఒక్క నిముషం!" - బీరువాలోంచి నైటీ తీసుకుంటున్నాను.

"నా బాధ నీకు అర్థమవదు రత్నా! నువ్వు సింగిల్ వుమెన్‌వి. సెక్స్ నీకు కప్పు కాఫీ లాంటిది" అంది.

బాత్రూంలోకి వెళ్ళబోతూ ఆగాను. పదాల అర్థాలు తెలిసి వాడిందా తెలీక వాడిందా? దాన్ని ఖండించాల్సినా ఖండించలేదు.

"అది నీకు మగ్గు బీరు లాంటిదా?"

"రాజుకి ఒకప్పుడు అలాగయినా ఉండేది. అప్పుడు అకేషనల్‌గా తాగేవాడు. యిప్పుడు రొటీన్‌గా తాగుతున్నాడు - సీసాలకి సీసాలు."

నన్ను పూర్తి చేసుకోమన్నట్టు చూసింది. కళ్ళు మూసుకుంది. బాత్రూంలోకి వెళ్ళి గీజర్ ఆన్ చేశాను. పాంటూ, షర్టూ వదిలి స్నానమయాక నైటీ వేసుకున్నాను.

అంతసేపూ హరి గుర్తు వస్తూనే వున్నాడు.


ఒకప్పుడు హరి లేకపోవటం దు:ఖంగానే ఉండేది. ఎందుకు?

హరి మళ్ళీ కనిపించడు! ఈ ప్రపంచంలోని దుఃఖాలను చూసి దుఃఖించడు. ఈ దుఃఖ మహాసాగరాన్ని తన రెండు చేతుల దోసిలితోనూ ఎత్తి పారబోయాలని తపన పడడు. తనకెన్నో అందుబాటులో ఉన్నా, ఏ ఒకటీ అందుబాటులో లేని వారి గురించి

రాత్రింబవళ్ళు నిద్ర పోకుండా ఆలోచించడు! ఈ ప్రపంచాన్ని శాసిస్తున్న అనేకానేక శక్తుల గురించి యిక మాట్లాడడు! చదువుకున్న శాస్త్రాలను శస్త్రాలుగా మార్చే తత్వమేమిటో వివరించడు! మొక్కవోని ఆత్మస్థైర్యంతో జీవితాన్ని గురించి విశ్లేషించడు!

అంతగా అలవాటయిపోయిన హరి ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయాడు. ఆలోచనను అలవాటు చేసి, దానితో తను లేని శూన్యాన్ని భర్తీ చేసుకోమని, వెన్ను తట్టి వెళ్ళిపోయాడు





హరి.

"నువ్వు ఒకత్తివీ ఉండలేవు. మళ్ళీ పెళ్ళాడు!" అనేది స్వేచ్ఛ.

హరిని పెళ్ళాడితే గదా! కలిసి జీవించాం! మళ్ళీ పెళ్ళా? అనే దానిని.

కొన్నేళ్ళయాక సెక్సు గురించి అడిగింది స్వేచ్ఛ.

"సెక్సు భౌతికావసరం - ఎలా కాదంటాను స్వేచ్ఛా! మనిషి సెక్సంతా మెదడులో ఉంది. నా మెదడులో ప్రస్తుతం అది నిత్యావసర వస్తువు కాదు" అన్నాను.

ఎనిమిదేళ్ళు గడిచాయి!

జర్నలిజమే వృత్తీ, వ్యావృత్తీనూ! కొన్నాళ్ళు పత్రికలలో గడిపాను. ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌ని. క్షణం తీరిక ఉండదు.

"బెంగుళూర్ లాంటి ప్రశాంత నగరంలో నీకు చేతి నిండా పనా?" అని బొంబాయి నుంచి నచ్చిన మిత్రుడొకడు అడిగాడు.

"జర్నలిజం కేవలం నేరాలకే పరిమితమా?" - బీహార్ నించి వచ్చిన ఓ స్నేహితురాలు అడిగింది.

టి.వీ. పెరిగాక జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయి! వీడియో మాగజైన్లు మొదలయాయి. జర్నలిస్టులకి స్వేచ్ఛ పెరిగిందా? సెన్సేషన్ పూత పూయకుండా ఏ వార్తకయినా అమ్మకపు విలువ ఏర్పడుతుందా? అమ్మకపు విలువలేని వార్త సహజ మరణం చెందటం లేదా?

హరి ఉంటే ఏం చెప్పేవాడు?!

బాత్రూం నించి బయటకు వచ్చాను. ఇంకా అదే ఫోజులో ఉంది స్వేచ్ఛ. జరిగిన గొడవ నించి నా మనసు తప్పించుకోజూస్తుంది. అదీ తప్పించుకుంటోందా?

కుర్చీలను సిటౌట్‌లో వేసాను.

ఎక్స్‌ప్రెస్ బిల్డింగూ, విశ్వేశ్వరయ్య టవరూ, జీపీవో బిల్డింగూ ఎదురుగా కనిపిస్తున్నాయి. క్రిందన సోడియం వేపర్ దీపాల కాంతిలో పరుగులు తీస్తున్నాయి వాహనాలు.

నిన్న యీ సమయానికి ప్రజల పేరిట విధించబడిన బంద్‌తో ఒకటీ అరా వాహనాలు నడిచాయి. ఈ రోజు నగరంలో కొన్ని ప్రాంతాలలో ప్రభుత్వం విధించిన కర్ఫ్యూ వల్ల ఆ మాత్రం కూడా వాహనాలు నడవటంలేదేమో! లేకపోతే - యింకా పడగొట్టవలసిన పేదల యిళ్ళ మీదకు మూకలు బయల్దేరాయో!

గాలి మాత్రం చల్లగా ఉంది.

ఉదయాలలోనే చలి! పొగ మంచు! సాయంత్రం చలి వేరు!

కుర్చీలో కూర్చుని - "స్వేచ్ఛా! యిక్కడకురా!" అన్నాను. రాలేదు. జవాబు లేదు.

లోపలికి చూచాను. మనసు ఆగలేదు. వెళ్ళి దాని భుజం మీద చెయ్యి వేసి నొక్కాను.

కళ్ళు తెరిచింది. ఆర్ద్రంగా వున్నాయి. చేతిని గట్టిగా పట్టుకుంది. నాలోకి చూస్తూ అంది.

"రత్నా! నింఫోమానియాక్‌ని కాను నేను. పదిమందితో తిరగను. రాంబాబు యిచ్చే సుఖం ముందు... మిగిలినవన్నీ వ్యర్థం! రాజు మీద నాకు కోపం లేదు. అతనో వర్కోహాలిక్. పెరఫెక్షనిస్టు. ప్రతిదాన్లోనూ పెరఫెక్షన్ కోసం అతని కృషి, తపనా, డివోషనూ.. సెక్సులో ఆనందాల ఎత్తులనూ, లోతులనూ నాకు పరిచయం చేసాయి. ఈనాటి నా పరిస్థితికి బాధ్యత పూర్తిగా రాజుదే!"

మాట్లాడుతోంది. దాన్నే చూస్తున్నాను.

స్వేచ్ఛని ఎంత సమర్థించాను! దాని ఉద్వేగాలకు ఎన్నిసార్లు తర్కాన్ని సమకూర్చాను! ఎన్ని లోపాలున్నా ఎంతగా పట్టించుకున్నాను స్వేచ్ఛను!

ఇప్పుడది నాలో వెదుక్కుంటున్నదేమిటో నాకు తెలుసు! దాన్ని నేను పుట్టించలేను! అది నాలో సహజంగా పుట్టాలి!

నేనేం చెయ్యాలిప్పుడు?"

జవాబియ్యాలి!

దాని చేతిని విడిపించుకున్నాను. కిచెన్‌లోకి వెళ్ళి టీ చేసి తీసుకువచ్చాను. నా కప్పు తీసుకుని సిటౌట్‌లోకి వెళ్ళాను. సిగరెట్ పొగ గుండెలలో నిండింది! దాని వెనకే టీ!

మనసులో మా యిద్దరి పరిచయమూ, స్నేహమూ కదిలాయి.

బిషప్ కాటన్‌లో ఏడవ తరగతిలో ఉన్నాను. స్కూల్ తెరిచిన కొత్త. ఓ రోజు స్వేచ్ఛ మా తరగతిలో ప్రవేశించింది. నా పక్కనే కూర్చోబెట్టింది టీచర్. మొదటి రోజుననే గుర్తు - అది తన నోట్సులో బొమ్మలు వేస్తోంది. ఓ బొమ్మ భయంకరంగా వేసి దాని కింద డాడీ అని రాసింది. పళ్ళు పెంచి కోరలు చేస్తోంది.

క్లాసయాక అడిగాను -

"మీ డాడీ నిన్ను కొడతారా?"

"డాడీలంతా వరస్ట్!"

"మా డాడీ కాదు"

"అయితే మీ డాడీ దగ్గరుండి పోతాను" అంది.

అదీ స్వేచ్ఛ! ప్రతి దానినీ జనరలైజ్ చేస్తుంది. వెంటనే పరిష్కారం యిదీ అంటుంది. ఏం చెప్పినా ఆలోచించదు. అయితే అవును! కాదంటే కాదు! ఓ మారు ఓ అభిప్రాయానికి వచ్చిందా యింక మారదు. అది ఎవరి స్నేహం వల్లనో చదువు పాడుచేసుకుంటోందిట!

అందుకని బలవంతంగా వాళ్ళ డాడీ స్కూలు మార్చారట!

మా పరిచయం స్కూలుతో ఆగలేదు!

ఒకరిళ్ళకు ఒకరు వెళ్ళేవాళ్ళం! మా అంతస్తులలో చాలా తేడా ఉంది! వాళ్ళకి కారూ, ఫోనూ ఉండేవి! వాళ్ళు ముగ్గురు అప్పచెల్లెళ్ళు. స్వేచ్ఛ చివరిది. స్వేచ్ఛకి కాంప్లెక్సులూ, అంతస్తులూ లేకపోగా దాని చొరవ మా స్నేహాన్ని బలపరిచింది.

వాళ్ళ అమ్మగారిది తెలుగు. మేమూ దొడ్డబళ్ళాపురం నుంచి వచ్చిన తెలుగు వాళ్ళం. ఆవిడ అందుకే నన్ను దగ్గరకు రానిచ్చిందనుకుంటాను. చామరాజుపేటలో ఉండేవాళ్ళు. ఆయన తమిళుడు. కోయంబత్తూరు నుంచి వచ్చారు వాళ్ళ పూర్వీకులు. సాహిత్యమూ, రాజకీయాలూ ఆయనకి జాస్తి. తమిళం నుండి కన్నడంలోకి అనువదించి ముద్రించేవాడు. రామమనోహర లోహియా తనకు ప్రాణమనేవాడు. స్వేచ్ఛకి ఆ పేరు పెట్టడంలోనే ఆయన అభిరుచి అర్థమవుతుంది.

అయితే తనకెలాంటి స్వేచ్ఛ లేదంటుందేం స్వేచ్ఛ?

నా కలాంటి సమస్య ఎందుకు రాలేదు?

మేం ఎనమండుగురం! మా అందరికీ వండి వడ్డించడానికీ, మా గుడ్డలు ఉతికి పెట్టడానికి మా అమ్మకి సరిపోయేది. నాన్న పగలొక ఉద్యోగం చేస్తూ సాయంకాలం కమ్మర్షియల్ స్ట్రీట్‌లో పనిచేసేవాడు. వాళ్ళు కావాలని మమ్మల్ని వదిలేసారో, కుదరక వదిలేసారో! మా యిష్టం వచ్చినట్లు చదువుకున్నాం! స్నేహాలు చేసాం. పుస్తకాలూ, స్నేహాలూ, నా బాల్యాన్నీ, మనస్తత్వాన్నీ ప్రభావితం చేసాయని యిప్పుడనిపిస్తోంది.

ఏమయితేనేం స్వేచ్ఛకీ, వాళ్ళ అమ్మకీ మధ్య కుషనింగ్‌గా పనిచేసేదాన్ని. ఇద్దరూ ఒకరివల్ల ఒకరు హింస పడుతున్నామనేవారు.

"ఇంతిలా చూసుకుంటే ఎందుకలా తయారవాలి?" అనేది ఆవిడ.

"ఎంత మంచిదాన్ని! నన్నే యిలా ఏడిపిస్తున్నారు - అసలు పిల్లలని ఏడిపించడమే తల్లితండ్రుల పాస్‌టైమ్" అనేది స్వేచ్ఛ.

ఇద్దరం ఒకే కాలేజీలో చేరాం! అది సైన్సు. నేను ఆర్ట్సు. సైన్సులో బలవంతంగా చేర్చారు. సైన్సంటే అయిష్టం కాదు. నాతో చదవడమే దానికి ఇష్టం.

అప్పటికే స్వేచ్ఛ పెద్దక్కకి పెళ్ళి చేశారు. భర్తతో స్టేట్స్‌కి వెళ్ళిపోయింది. రెండో అక్కకీ అమెరికాలో అల్లుడిని కుదిర్చారు. పెళ్ళయాక వెళ్ళిపోతుంది.

"కనీసం సైన్స్ డిగ్రీ కావాలంటున్నారు పెళ్ళి కొడుకులు" అంది వాళ్ళ అమ్మ.

"అమెరికా పెళ్ళి కొడుకులే మా అమ్మకి కనబడతారు" అంది స్వేచ్ఛ.

సైన్సులో దానికి మంచి మార్కులే వచ్చేవి.

"యింకా చాల్లేదుట మా డాడీకి" అనేది స్వేచ్ఛ.

ఫిలాసఫీ, ఎకనామిక్స్, హిస్టరీ, పోలిటిక్స్, సైకాలజీ - ఒకటేమిటి కనిపించిన పుస్తకమల్లా నా సబ్జక్టయినా కాకపోయినా తినేసేదాన్ని! ఇప్పటికీ పుస్తకముంటే టీవీ కూడా చూడబుద్ధెయ్యదు! పుస్తకంలో ఎంత ఎక్సర్‌సైజ్ ఉంది! ఫిక్షనయితే ఆ సన్నివేశాలను కల్పించుకోవాలి. పాత్రల భాషా, యాసా ఎవరయినా మాట్లాడుతుంటే ఎలా ఉంటుందో ఊహించుకోవాలి! ఆ పాత్రల కదలికలను, హావభావాలను రచయిత యిస్తున్న పద చిత్రాల సంకేతాలతో, అతను వదిలేసిన ఖాళీలలో నింపుకోవాలి! బుద్ధికీ, హృదయానికీ ఎంత పని! నాన్ ఫిక్షనయితే సరే సరి! ప్రపంచ గమనం గురించి, వ్యక్తుల గురించి ఎన్ని విశేషాలు! ఎన్ని విశ్లేషణలు! ఎన్ని దృష్టి కోణాలు! మానవుడు వేసుకునే ఎన్ని ప్రశ్నలు! యిచ్చుకునే ఎన్ని రకాల జవాబులు! ఎంత అద్భుతం మానవ జాతి సృష్టించుకున్న యీ పుస్తకమనే సాధనం!!

స్వేచ్ఛ కూడా చదివేది!

దానికి పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకునే పద్ధతి కన్న, ఊహలతో సిద్ధాంతీకరించుకోవడమూ, తన యిష్టాయిష్టాలను రేషనలైజ్ చేసుకోవడానికి, సిద్ధాంతాలను వక్రీకరించి వాడుకోడమూ అలవాటయింది. కాని జరిగిపోయిన వాటి మీద అది తీసే థీరీలు దిగ్భ్రమ కలిగించి, జరిగిన వాటి మీద దాని అభిప్రాయాన్ని అంగీకరించేలా చేసేవి.

డిగ్రీ రెండవ ఏడాది రాజు పరిచయమయాడు. ఇంజనీరింగ్ మూడో ఏడాదిలో ఉన్నాడు.

"మా డాడీకి, మమ్మీకి రాజు యిష్టమవడు! రాజుని పెళ్ళాడి తీరుతాను" అంది ఓ రోజు స్వేచ్ఛ.

రాజుని ప్రేమించిందా - రాజుని తన తల్లీదండ్రీ యిష్టపడరన్న ఊహను ప్రేమించిందా స్వేచ్ఛ? ఆ నాడే నాకు అనుమానం వచ్చింది.

"రాజుకి కారు లేదు. ఫోను లేదు. కానీ మనసుంది. కలలున్నాయి. కలలకీ, మనసుకీ ఏ తల్లిదండ్రులు విలువ ఇస్తారు? అందగాళ్ళనూ, అమాయకులనూ అంతా దగా చేస్తారు. రాజుని రక్షించాలి. దోవలో పెట్టాలి. నాకు తల్లిదండ్రులను ఎదిరించక తప్పదు. అతన్ని పెళ్ళాడక తప్పదు"

ఇంచు మించు స్వేచ్ఛ ఉద్దేశ్యమది.

"నువ్వు నెగిటివ్ భావాలతో పెళ్ళాడాలనుకుంటున్నావు స్వేచ్ఛా" అన్నాను. నేనన్నే నెగిటివ్ భావాలేమిటో తెలుసుకోవాలి. అవి నెగిటివ్ అని ఒప్పుకోవాలి లేదా తప్పని

వాదించాలి. అలా చేయలేదు. తనకి నెగటివ్ భావాలు లేవని వాదించింది. అదీ టిపికల్ స్వేచ్ఛ!

వాళ్ళిద్దరూ లాల్‌బాగ్‌లో కలుసుకునే వారు. ముగ్గురం ఎమ్.టి.ఆర్.లో కాఫీలు తాగేవాళ్ళం! అప్పటికీ యిప్పటికీ బెంగుళూరులో మారనిది ఎమ్.టి.ఆర్. కాఫీ రుచి! శుచి!

కబుర్లు చెప్పుకుంటూ ప్రపంచాన్ని మరచిపోయేవారు వాళ్ళు! వాళ్ళకి ఎడంగా కూర్చుని ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి పుస్తకాలలో మునిగిపోయేదానిని! నాతో వెళ్తున్నానని యింట్లో చెప్పేది స్వేచ్ఛ. కోపం చూపిస్తే బతిమాలేది!

"అయితే రాజుని పెళ్లాడేయ్! మీ వాళ్ళకి పరిచయం చెయ్యి"

"లాభం లేదు. వాళ్ళు ఒప్పుకోరు. రహస్యంగా పెళ్ళాడాల్సిందే" అనేది.

రహస్య వివాహంలో దానికేదో థ్రిల్ ఉందనిపించేది.

రాజుతోనూ మాట్లాడేను.

"-స్వేచ్ఛది వెన్నలాంటి మనసు. ఏ వేడినీ తట్టుకోలేదు. ఆమెని అనుక్షణమూ నేను అంటిపెట్టుకుని ఉండాలి. అదో ఛాలెంజ్ నాకు! నేను ఛాలెంజ్‌లను తీసుకుంటాను! మోస్ట్ ఇంప్రాక్టికల్ గర్ల్. నాలాంటి ప్రాక్టికల్ మనిషికి ఛాలెంజ్! అయ్ లవ్ ఛాలెంజెస్" అన్నాడు రాజు.

"అయితే వాళ్ళ వాళ్ళతో మాట్లాడు" అన్నాను.

"ఆ పని స్వేచ్ఛ చెయ్యాలి"

"వాళ్ళు ఒప్పుకోకపోతే?"

"ఎందుకొప్పుకోరూ? నేను యింజనీర్ని. వాళ్ళ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. సుఖపెట్టగలను. ఇంగితం ఉన్న ఎవరయినా ఎగిరి గంతేస్తారు"

నాకు యిద్దరి పద్ధతీ అయోమయంగా ఉంది. గంటల తరబడి కలిసి మాట్లాడుకుంటారు. ఒకరి గురించి ఒకరికి కించిత్తు కూడా తెలియదా? చూద్దాం - ఏమవుతుందో - అనుకున్నాను కొన్నాళ్ళు. స్వేచ్ఛకి సమర్థన కావాలిగాని విమర్శ కాదు గదా! మనసు ఆగలేదు!

"ఇద్దరు కలిసి జీవించడానికి - ఒకరి నొకరు ఉద్ధరిద్దామనుకోవడం - హెల్ప్ చెయ్యదు. సమస్యలు సృష్టించవచ్చు" - ఆ మాట అనటానికి నేను ఎంతో ఆలోచించాను. వాస్తవానికి అది ఉపోద్ఘాతమే! నన్ను పూర్తిచెయ్యనీలేదు.

"నీకు వ్యక్తుల గురించి బొత్తిగా తెలీదు. సమాజాన్ని బట్టి వ్యక్తులు ఉంటారనుకుంటావు. వ్యక్తులు ఒకరిలా ఒకరుండరు. ఒకరి సమస్య ఒకరికి సమస్య కాదు. ఒకరికి పరిష్కారం

మరొకరికి సమస్య. రాజూ నేనూ బార్న్ ఫర్ యీచ్ అదర్! మాఆత్మలు ఒకటయి పోయాయి" అంది ఉద్వేగంగా.

అది అంత ఉద్వేగంగా చెపుతూంటే నాకూ అలాంటి ప్రేమ దొరుకుతుందా అనుకున్నాను ఆ నాడు. దాని మాటల్లో వ్యక్తమయే ఆత్మవిశ్వాసం దాని సమస్యలను అదే పరిష్కరించుకోగలదనుకున్నాను. దాని మాట మాటకీ మధ్య తేడాను కూడా మరిపించేది దాని ఉద్వేగం.

"రాజు గురించి మావాళ్ళతో చెప్పక తప్పదు" అంది స్వేచ్ఛ ఓ రోజు – "రహస్య వివాహానికి రాజు ఒప్పుకోలేదు. 'మన వాళ్ళని ఒప్పించుదాం' అన్నాడు. వాళ్ళ వాళ్ళు ఒప్పుకుంటారు. మా వాళ్ళు వెళ్ళి మాట్లాడుకోవాలి. అంతే!" అంది.

"రాజుని మరిచి పోతావన్నమాట"

"శాస్త్రాలలో గాంధర్వ వివాహమంటే తెలుసా! భారతీయ స్త్రీ స్వేచ్ఛకి అద్భుత నిదర్శనం అది. యిష్టపడితే పెళ్ళయిపోయినట్టే!"

"అలాంటి అర్థం ఎవరు చెప్పారు – నీకు?"

"అర్థం ఎవరూ చెప్పనక్కరలేదు – అది హృదయానికి అర్థమవుతుంది"

నేను దాన్ని విచిత్రంగా చూసాను. స్వేచ్ఛకి పునాదులు నాకు ఏనాడూ అర్థం కాలేదు. అది దేన్నయినా వాడుకోగలదు! దాన్ని ఎవరయినా వాడుకోగలరు! అనిపించింది.

నేనూ, అదీ వాళ్ళ అమ్మతో మాట్లాడాం! ఆవిడ ఆయనతో చెప్పింది. రాజు గురించి ఆరా తీసాక ఆయన అన్నారు – "స్వేచ్ఛని నేను పెంచాను. దానికి స్వయం నిర్ణయాధికారం యిచ్చాను. దాని ఎంపిక తప్పవదు"

రాజు తల్లిదండ్రులతో మాట్లాడారు. అతన్ని అమెరికా పంపుతామన్నారు. వాళ్ళు, "మీ అల్లుడు మీ యిష్టం" అన్నారు.

స్వేచ్ఛ గర్వంగా అంది – "చూసావా మా డాడీ మమ్మీ ఎలా కాళ్ళ బేరానికి వచ్చారో!"

ఈ మొత్తం వ్యవహారంలో రాజులో ఎలాంటి లోపమూ స్వేచ్ఛకి కనిపించలేదు. కనీసం అతను తల్లిదండ్రులతో తన ప్రేమ గురించి కూడా చెప్పలేదు. ముందు వాంఛించిన థ్రిల్లుని కూడా అంత వేగంగానూ మరిచిపోయింది. ఈ భావాలన్నీ నేను మనస్సులోనే ఉంచుకున్నాను. అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి. దాని బ్రతుకూ, సంతోషమూ దానివి – నా అనుమానాలు వెలిబుచ్చి దాని సంతోషాన్ని పాడుచేయటమెందుకూ – అనుకున్నాను.

పెళ్ళయింది.

రాజు చదువు పూర్తయింది. డిగ్రీతో చదువు ఆపేసింది స్వేచ్ఛ. రాజు అమెరికా వెళ్ళనన్నాడు.

"నా తెలివి తేటలను యీ దేశ కళ్యాణానికే వినియోగిస్తాను" అన్నాడు.

ఆ రోజుల్లో అత్తమామలకు రాజు కొరకరాని కొయ్య అయ్యాడు. అతన్ని లొంగదీసుకోవటానికి స్వేచ్ఛని కాపురానికి వెళ్ళొద్దని కూడా వాళ్ళు చెప్పారు.

"వ్యక్తుల స్వేచ్ఛని సమాజాలు ఎలా హరిస్తున్నాయో చూడు!" అంది స్వేచ్ఛ. నేను కాస్త తెల్లబోయాను. ఇందులో సమాజమేమిటి - హరించటమేమిటి - అని అడిగాను.

"కుటుంబమూ ఒక చిన్న సమాజమే గదా! మా తల్లిదండ్రులూ, అప్పజెల్లెళ్ళూ, వాళ్ళ భర్తలూ రాజుని వదిలెయ్యమంటున్నారు"

వాళ్ళలా వదిలెయ్యమనటం నిజమయితే తప్పే! స్వేచ్ఛ వాళ్ళను కాదనటం సమర్థనీయమే! అయినా స్వేచ్ఛ అన్నదానిని పొడిగించాను.

"నువ్వూ, రాజూ, నీ పుట్టబోయే పిల్లలూ కూడా సమాజమే గదా! వాళ్ళ కోసం నువ్వూ, నీ కోసం వాళ్ళూ ఎంతో కొంత, ఎప్పుడో అపుడు మీ యిష్టాలను చంపుకోవలసి రావచ్చు గదా!" అన్నాను.

"ఎవరి కోసం వాళ్ళు పోరాడాల్సిందే! ఎవరికి వారు ఎదగాల్సిందే!" అంది.

తర్వాత రాజుని కలిసినప్పుడు అన్నాడు -

"రత్నా! నేను ఒక్కడినే కొడుకుని!జీవితంలో ధనమే ప్రధానమా? మా వాళ్ళు స్వేచ్ఛని నా ఆనందం కోసమే అంగీకరించారు. నా బాగు కోసమే అమెరికా వెళ్ళే అవకాశాన్ని వదలుకోవద్దన్నారు. అయినా వాళ్ళని వదలలేను. అంతకన్నా యీ దేశంలోనే ఏదయినా చెయ్యాలనుంది - అది ధనార్జన మాత్రం కాదు"

రాజూ, స్వేచ్ఛా చాలా సుఖంగా సహజీవనం సాగించారు. రాజుకి ఎన్.ఎ.ఎల్.లో మంచి ఉద్యోగమే దొరికింది. ట్రెనింగ్ కోసం జపాన్ పంపారు. కష్టపడగల మనుషులు ఓ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేయవచ్చునని ఆ దేశాన్ని చూసాక రాజుకి అనిపించింది.

"భారతీయులకి శ్రమపడే తత్వం లేదన్నది శుద్ధ అబద్ధం. ఇలాంటి ప్రచారాన్ని ఎవరు ఎందుకు చేశారో, చేస్తున్నారో అర్థం కావటం లేదు రత్నా! యీ దేశంలో వున్న లోపమల్లా విద్యావంతులలో ఆత్మవిశ్వాస రాహిత్యం. నా దేశానికి కావలసింది - విదేశాల నుంచి అప్పులూ, భారీ పరిశ్రమలూ కాదు - విద్యావంతులకు మన వనరులనూ, మానవ శ్రమనూ ఛానలైజ్ చేయగలమన్న విశ్వాసం..." - జపాన్ నుంచి వస్తూనే అన్నాడు రాజు. అంతటితో ఆగలేదు.

ఉద్యోగం వదిలేస్తానన్నాడు. స్వేచ్ఛ తల్లిదండ్రులు చాల వ్యతిరేకించారు. నీకున్న పెట్టుబడి ఏమిటి? నువ్వేం ఫ్యాక్టరీ పెట్టగలవు - అన్నాడు స్వేచ్ఛ తండ్రి. అప్పటికి స్వేచ్ఛకి ఇద్దరు పిల్లలు. అయిదులోనూ, మూడులోనూ ఉన్నారు. అది తల్లిదండ్రుల

మాటల్లో పడింది.

"యితను దిగుతున్నది నుయ్యి. నీ వాటా డబ్బు మేం ముందే యిస్తామని రాజు ఆశ. చచ్చేదాకా యివ్వం - అన్నారు మా అమ్మా నాన్నా" అంది స్వేచ్ఛ.

అప్పటికి నేనూ, హరీ పెళ్ళాడాం! అయిదేళ్ళ పరిచయమూ - వివాహంగా అనాలా - కలిసుండటంగా అనాలా - మారింది. స్వేచ్ఛ కుండే రొమాంటిక్ భావాలు నాకెందుకు లేవనిపించేది. "రొమాన్సు ఊహను బట్టి ఉంటుంది. ఆమెవి మాత్రమే రొమాంటిక్ భావాలనుకోరాదు. మనం మాత్రం ఒకరిని విడిచి ఒకరు ఉండగలమా?" అనేవాడు హరి. జనతా పార్టీ అధికారానికి వచ్చే ముందు కలిగిన ఉత్సాహంలో మాకు పరిచయమయింది. మాకూ, మిత్రులకూ మధ్య తరచు వాదోపవాదాలు నడిచేవి. మేమిద్దరం ఒకరివల్ల మరొకరు ప్రభావితులయామో, భావాలలో దగ్గరతనం వల్ల దగ్గరయామో - దగ్గరయాం! ఆధునిక మానవ సమాజంలో జర్నలిజం అతి ముఖ్యమైన అంగమనీ, అది తన స్వతంత్ర ప్రతిపత్తి కోసం సామాన్య విలేఖరి నుంచి పత్రికా యజమానిదాకా ప్రతి ఒక్కరూ బాధ్యతతో శ్రమించడమూ, హక్కుల కోసం పోరాడగలగటమూ మాత్రమే - దాన్ని ఎఫెక్టివ్‌గా పని చేయించగలమని మేమంతా స్థూలంగా అనుకునేవాళ్ళం. ఎనభై రెండులో మేం ఒకటయాం!

హరితో స్వేచ్ఛ సమస్య గురించి మాట్లాడాను.

"రాజుకి అభిప్రాయాలున్నాయి. వాటితో అతను జీవించాలనుకుంటున్నాడు. జీవించడం కోసం ఏ అభిప్రాయాన్నయినా గొడుగుగా వాడుకునే సంస్కృతిలో ఉన్నాం! అది మన దేశానికి పరిమితంకాదని మన పాలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అవినీతికి సాంఘిక గౌరవం యివ్వటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి కాలంలో రాజు డబ్బు కోసం కాకుండా అభిప్రాయాల కోసం సాహసం చేస్తున్నాడు. దాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయినా అభినందిస్తున్నాను నేను - వీలయితే స్వేచ్ఛని కూడా రాజుకి సపోర్టుగా నిలబడమను" అన్నాడు.

"ప్రైవేటు ఆస్తిని వ్యతిరేకిస్తావు. వ్యక్తుల చేతిలో పెట్టుబడికి దోపిడీ లక్షణముంటుందం టావు. రాజు ఫ్యాక్టరీ పెడతానంటే సాహసమంటావేమిటి? మగవాడు మాట చెల్లించు కోవటానికి ఆడే ఎత్తులను నువ్వు ఆశయాల రంగుటద్దాల్లోంచి చూస్తున్నావు హరీ" అన్నాను.

"మౌలికంగా నువ్వన్నది నిజమే రత్నా! సుఖంగా ఉన్న ఉద్యోగం వదిలిపెట్టడమూ, తగినంత పెట్టుబడి లేకుండా ముందు కురకడమూ ఓ విధంగా సాహసమే! అతని వల్ల జరిగే దోపిడీ ఎంతో - భారతదేశపు అభివృద్ధిలో భాగమెంతో నాకూ స్పష్టంగా తెలియదు.

సాహసం పట్ల మాత్రం నాకు ప్రత్యేక గౌరవముంది. పోతే మగవాడూ - మాట చెల్లించుకోవటమూ - ఓ స్త్రీ రత్నమూ - అప్రస్తుత ప్రసంగాలు!"

"నేను నిన్ను అర్థం చేసుకోలేకపోతున్నాను"

తనకే అర్థం కానిది నాకేం చెప్పగలడు హరి?

ఈ విషయంలోనూ స్వేచ్ఛని సమర్థించాను. ఉద్యోగం వదల వద్దని కొన్నాళ్ళు రాజుతో పోట్లాడింది. ఓ నెల రోజులు అతన్ని వదిలేసింది. పిల్లలతో పుట్టింట్లో ఉంది.

ఓ రోజు తుపాన్‌లా వచ్చింది స్వేచ్ఛ.

"రాజు కంపెనీకి రేపే ప్రారంభోత్సవం! నువ్వూ, హరీ మాకు చీఫ్ గెస్టులు" అంది. నా కది అన్నది అర్థమవలేదు. అది రాజు దగ్గరకి వెళ్ళిపోయిందిట. అతను ఉద్యోగానికి రిజైన్ చేసేసాడుట.

"ఒక్క రాత్రి కూడా నిద్ర పట్టలేదు. చూసావా మనిషిని ఎలా అయిపోయానో! రాజుతో సెక్సు కన్న ముఖ్యమైందే ముంది యీ బతుకులో! ఏం జరిగితే అది జరగనీ" అంది.

భార్యాభర్తల వ్యావహారిక సమస్యలలో సెక్సు సుఖం ద్వారా ఒకరు రెండో వారి మీద ఆధిక్యం సంపాదించవచ్చున్నది నాకు కొత్త ఊహ. దాని సెక్సు జీవితంలోకి తొంగి చూడాలన్న కుతూహలం లేకపోయినా స్వేచ్ఛకి బిడియాలు తక్కువ. పెళ్ళయ్యాక అవీ పోయాయి. మా స్నేహానికి మినహాయింపులు లేవు.

సిద్ధాంతాల ప్రకారం ఆశయాల ప్రకారం అధికారం సంపాదించటం తప్పే! కాని ప్రపంచంలో అధికారం ఓ వాస్తవం. ఆ అధికారం ఎలా, ఎందుకు వినియోగింపబడుతున్న దనేది సమస్య. దాన్ని సాధించటంలో సక్రమమూ, అక్రమమూ, న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలూ ఉండొచ్చు. స్వేచ్ఛ మీద రాజు సెక్సు ద్వారా అధికారం పొందడం ఓ వాస్తవం. అది సాధారణమో కాదో, ఉచితమో కాదో నాకు యిప్పటికీ తెలీదు.

మేం వెళ్ళాం!

రాజు మల్లేశ్వరంలో ఓ యింటిని అద్దెకు తీసుకున్నాడు. ముందు భాగంలో యింటి వాళ్ళున్నారు. సందులోంచి వెనక్కి వెళితే వెనుక వాటాలోకి ప్రవేశం. ముందుగా ఓ చిన్న గదీ, లోపల పెద్ద హాలూ ఉన్నాయి. వెనకాల చాలా ఖాళీస్థలం ఉంది. అందులో రేకుల షెడ్డు వేసాడు రాజు. దానిలో లేత్, పెయింటింగ్‌కి కంప్రెసరూ, వెల్డింగు మొదలయిన పనులకి చాలా సామాన్యమైన మెషీన్లూ ఉన్నాయి. ఆరుగురు పనివాళ్ళు. వాళ్ళెవరికీ చదువు అర్హతలు లేవు. అందరికీ వర్కుషాపులో అనుభవం ఉంది. వాళ్ళు ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో రాజే చెపుతాడుట!

రాజూ, స్వేచ్ఛా, రాజు తల్లీ, మేం యిద్దరమూ ఆ మహోత్సవానికి హాజరైన వాళ్ళం!

టీ యిచ్చాడు రాజు. నాకు నిరుత్సాహమూ, బాధా కలిగాయి. కోరి కష్టాలు తెచ్చుకుంటున్నాడు - అనుకున్నాను. హరి మాటల్లోకి దిగాడు.

విదేశీ విడి భాగాలు సమయానికి దొరకకపోవటం వల్ల పరిశ్రమల్లో వచ్చే సమస్యలను వివరించాడు రాజు. చిన్న చిన్న సైన్సు సూత్రాల ద్వారా వాటిని పరిష్కరించటాన్ని వివరిస్తున్నాడు రాజు.

"నేను రెగ్యులర్ ప్రోడక్ట్ లేవీ చెయ్యటం లేదు. మార్కెట్ చేయటం సమస్య లేదు. మన దేశానికి కావాల్సింది టెక్నాలజీ! సైన్సూ, ఇంజనీరింగూ కాదు. మన యింజనీర్లకి రెంచి పట్టుకోవటం నామోషీ. మెషిను పని చేయటమెలాగో చెప్పగలరు! పని చేయించటానికి ప్రయత్నించరు. సైన్సులో అభివృద్ధిని ప్రజలకి అందివ్వటంలో టెక్నాలజిస్టులే వారధులు!"

హరీ, నేనూ వాళ్ళని అభినందించి వచ్చేసాం!

రాజుకీ, స్వేచ్ఛకీ జీవితావసరాలలో లోటేం రాలేదు.

"కారు కొనలేకపోయాడు - అతని పిచ్చి వ్యవహారం ఫలించలేదన్నాడు!" - స్వేచ్ఛ తండ్రి. "పోనీపెద్ద పెద్ద పరిశ్రమల వాళ్ళకు వెండార్‌గా పనిచేసినా బోల్డంత సంపాదించును!" అన్నాడు.

రాజు ఒక మోపెడ్ మీద తిరిగేవాడు.

ఆ ఏడాదే హరి నాకు దూరమయ్యాడు. భౌతికంగా దూరమయినా మానసికంగా చేరువగా వున్నాడనీ, సైద్ధాంతికంగా నా నడకకు అతను స్థైర్యాన్ని యిస్తున్నాడని నాకు నేను నచ్చచెప్పుకున్నాను. ఆ ఏడాదే అమ్మ కూడా పోయింది. స్వేచ్ఛ నన్ను కొన్నాళ్ళు కనిపెట్టుకుంది.

మా యిద్దరిదీ లీగల్‌గా వివాహం కాదు గనుక హరి కొన్న యీ అపార్ట్‌మెంట్ తమదేనని నన్ను ఖాళీ చెయ్యమని పేచీ పెట్టారు హరి తల్లిదండ్రులు! అమెరికా నుంచి వచ్చిన హరి అన్నయ్య వాళ్ళని వారించాడు. నా పేర అపార్టుమెంట్‌ని రిజిస్ట్రేషన్ చేయించాడు. తల్లిదండ్రులని తనతో తీసుకువెళ్ళిపోయాడు.

ఆస్తిని ఎవరయినా సరే వదులుకోరు - అనుకునేదాన్ని. ఆస్తి మీద నా ఊహలకూ, వాస్తవానికీ మధ్య తేడాలు స్పష్టమయ్యాయి. ఆస్తి గురించి పెనుగులాట వేరు. దాని వల్ల జరగటాని కవకాశమున్న దోపిడీ వేరు. యీ తేడా నా యీ అనుభవంతో కొంత అర్థమయింది.

ఆ తర్వాత - బహుశ నా యీ అనుభవం కలిగించిన చింతన వల్లననుకుంటాను - రాజుని మరింత మెచ్చుకోలుగా అర్థం చేసుకున్నాను. రాజుకి సాంసారికి జీవితం పట్ల

ఆసక్తి తగ్గుతోందన్న విషయం స్వేచ్ఛ చెప్పింది. ఒకప్పుడైతే దానిని మరొకలా అర్థం చేసుకునేదాన్నేమో! ధన సంపాదనలోనూ, దోపిడీ వల్ల కలిగే పైశాచిక మానసికానందం లోనూ - దోపిడీ చేసే వర్గాలు తమ లైంగికానందంతో సహా ప్రతి సహజానందాన్నీ పోగొట్టుకుంటారు - అనుకోగలిగేదాన్నేమో!

దానికి బదులుగా -

ఒక విషయంలో ఏకాగ్రత, నిమగ్నత అనేక విషయాల పట్ల తూష్ణీ భావమూ, నిరాసక్తతా కలిగంచవచ్చునీ, రాజుకి పనిలో ఉండే ఏకాగ్రత వల్లనే యిలా అవుతోందని అనుకున్నాను.

స్వేచ్ఛ మరోలా అంది - "స్వార్థం పెరుగుతోంది! తన సుఖం తనదే! నన్ను పట్టించుకోటం లేదు"

"ఏం సుఖం"

"ఆర్జన"

"బాగా సంపాదిస్తున్నాడా?"

"ఏం సంపాదన! మా అమ్మ చనిపోయే ముందు ఎంత ఏడ్చింది - ఈ పిచ్చాడిని కట్టుకుని ఏం సుఖపడ్డావు? ఓ యిల్లయినా కట్టలేదు - అని. డొనేషన్ కడితే మా పెద్దాడికి యింజనీరింగులో సీటు దొరికేది! డిప్లమాలో చేర్చాడు"

కొంచెం వాదన మీద స్వేచ్ఛ అంది - పడక గదిలో అతను మునుపటిలా ఉంటే రాజు మీదెలాంటి ఆరోపణలూ ఉండవుట! మానసిక వైద్యుడిని సంప్రదించమన్నాను. బలవంతాన అతన్ని తీసుకెళ్లింది స్వేచ్ఛ. శారీరక లోపమేం లేదన్నాడట! మానసికంగా అతన్ని ఉత్తేజితుడిని చేయమని సలహా యిచ్చి మందులు రాసిచ్చాడట.

అంతకు ముందు తామిద్దరూ అలవాటు పడిన పద్ధతికి వ్యతిరేకంగా ఎలా ఉండాలో తెలీటం లేదంది స్వేచ్ఛ. 'రాజే సూత్రధారుడు. సర్వం సహా చక్రవర్తిలా నా శరీరాన్ని పాలించేవాడు' అంది.

చాలా నిర్లిప్తంగా విన్నాను.

నా సెక్సు జీవితం గురించి అది ఎప్పుడూ తెలుసుకోలేదు. పధ్నాలుగేళ్ళుగా భార్యకి దూరంగా ఉన్న లక్ష్మణుడితో సీతా వియోగం గురించి వాపోయే రాముడు గుర్తుకు వచ్చాడు.

సరిగ్గా ఈ రోజు ఉదయం -

తను బయటకి పరుగెడుతుండగా వచ్చింది స్వేచ్ఛ. నిన్నను కావేరీ జలాల గురించి జరిగిన బంద్‌లో బెంగుళూరంతా అల్లకల్లోలమయి పోయింది. స్వేచ్ఛతో మాట్లాడడానికి సమయం లేదు. అపార్టుమెంట్‌లో ఉంటానంది. సరే అన్నాను.

తిరిగి వచ్చేసరికి - రాజు ఉన్నాడు.

"ఇలాంటి పనికి నువ్విలా రూమివ్వటం న్యాయమేనా రత్నా?" అన్నాడు. మెల్లిగా అర్థమైంది. స్వేచ్ఛ ఓ కుర్రాడిని తీసుకువచ్చిందిట. పేరు రాంబాబు! స్వేచ్ఛ పెద్దకొడుకు క్లాస్‌మేట్‌ట! రాజుకి యింతకు ముందే యీ వ్యవహారం తెలిసిందట. నెత్తీ నోరూ మొత్తుకున్నాడట. రాంబాబుని కలుసుకుంటూనే ఉందిట. ఈ గొడవలో స్వేచ్ఛ కూతురు నిద్రమాత్రలు మింగిందట! సకాలానికి వైద్యం జరిగి బతికిందట. అప్పట్నుంచి స్వేచ్ఛ రాంబాబుని యింట్లో కలుసుకోవటం మానేసిందట!

ఇదంతా నాలుగయిదు నెలల నుంచి నడుస్తోందిట!

నాకివేమీ తెలియవన్నాను. ఆరేడు నెలలుగా మేం ఎప్పుడయినా ఫోను మీద పలకరించుకోవటమే తప్ప కలుసుకోలేదన్నాను.

"నేను స్వేచ్ఛతో మాట్లాడతాను. నువ్వు వెళ్ళు రాజూ" అన్నాను.

స్వేచ్ఛతో అన్నీ మాట్లాడదామనే అనుకున్నాను.

మనసు సహకరించటం లేదు. ఈ రోజు చూసిన దృశ్యాలూ, విన్న ఏడుపులూ, కథలూ నన్ను దొలిచేస్తున్నాయి. వాటిలో ఎలాంటి ఎమోషను లేకుండా, వ్యాఖ్యానించకుండా వార్తగా వ్రాయగలగటమే జర్నలిజమంటారు. అలా వ్రాయటానికి ఎంత శ్రమ! ఎన్ని ఆలోచనలను వదిలించుకోవాలి! వదిలించుకోవటం అలవాటయితే 'దొంగలు' అవుతారు! పట్టించుకోవటం అలవాటయితే 'విప్లవకారులు' అవుతారు.

అసహనంగా కళ్ళు విప్పేసరికి -

ఎదురుగా స్వేచ్ఛ! ఎదురు చూస్తున్నట్టు అంది -

"నన్నేం చేయమంటావు రత్నా!"

"చావు!" అన్నాను.

యూ టూ బ్రూటస్ - అంటున్న సీజర్లా చూసింది. నేను చూపు తిప్పుకోలేదు.

"నా నిస్సహాయస్థితి మీద నీకూ సానుభూతి లేదా రత్నా?"

"ఎవరికయినా ఎలా సానుభూతి ఉంటుందసలు! వాళ్ళ కారణాలు వేరు. పవిత్ర భారతనారీ, శీలం, యిదీ అదీనూ! నా కారణాలు వేరు! - నీకు పని లేదు. మొగుడు సంపాదిస్తున్నాడు. పిల్లలు చదువుకుంటున్నారు. ఒంట్లో కొవ్వు పెరిగింది. ఆ తర్వాత ఏముంటుంది నీకు? వాంఛలూ, రోగాలూనూ!

ఒక్క గదిలో పిల్లలతో, అత్తమామలతో, ఆధారపడ్డ వాళ్ళతో బ్రతుకీడ్చే మధ్య తరగతి వాళ్ళకు యిలాంటి కొవ్వు పట్టదు. అసలు సంసార సౌఖ్యమే యిన్నాళ్ళుండదు! టార్పాలిన్ గుడ్డల కిందా, ప్లాస్టిక్ పేపర్ల కిందా, గోనెగుడ్డల మీదా, ప్లాట్‌ఫారాల మీదా బ్రతికి

ఎండిపోయిన శరీరాలతో ఉండేవాళ్లకు యిలా నూగు పట్టదు. నో! నీది రోగం కాదు! పొగరు! నీది బాధా కాదు. సమస్యా కాదు!

"మీలాంటి గాడిదలకి – వ్యక్తి స్వేచ్ఛ – అన్న నినాదాన్ని ఎలాంటి ఆలోచన చేయటానికయినా, ఏ ఛండాలప్పని చేయటానికయినా సిద్ధంగా ఉంచారు. దేన్నయినా అందుకునే అవకాశమున్నందున కలిగే విశృంఖలతకు నా సానుభూతి ఏమిటి? మీకు సిద్ధాంతాల దొంతరలున్నాయి కప్పుకోవటానికి! నేనెందుకు?

"రాజు నిన్ను వీధిన పడొద్దంటున్నాడు. తనని వీధిలో పెట్టొద్దంటున్నాడు. ఎదిగిన పిల్లలను చూడమంటూన్నడు! నేనింక చెప్పేదేమిటి? ఉంటే అలా ఉండు! ఉండకపోతే చావు!"

కళ్ళు మూసుకున్నాను. ఇంకా ఎన్నో అనాలనుంది. మనసులో వాక్యాలు తయారవుతున్నాయి. కళ్లు విడటం లేదు. శరీరం బడలికో! మనసులో ఆందోళనో! క్రమంగా ఆలోచనలు, దృశ్యాలు అన్నీ ఆగిపోయాయి.

హఠాత్తుగా చలి అనిపించింది.

దిగ్గుమన్న గుండెలతో లేచాను. అపార్ట్‌మెంటంతా తిరిగాను. తలుపు తీసి బయటకు చూసాను. ఎక్కడా లేదు స్వేచ్ఛ!

పోతే పోయిందిలే – అనుకుని తలుపులు మూసాను.

ఆకలి చచ్చిపోయింది.

పక్క మీద దొర్లాను.

లేచి, కిటికీల తెరలు తీసి, రెక్కలు తెరిచి, బయట నగరాన్ని చూసాను. రాత్రి దీపాలు, పనిచేసి అలసిపోయినట్టు కునికిపాట్లు పడుతున్నాయి. పగటి శ్రమలో అలసిన పౌరులకు వారి వారి ఆర్థిక శక్తులకు అనుగుణంగా నిద్రనూ, మత్తునూ, వినోదాన్నీ అమ్ముతోంది నగరం.

చలి గాలి జివ్వున వీచి – కిటికీలు – మూసెయ్యమంది.

సిగరెట్లు తగలడుతున్నాయి.

స్వేచ్ఛ మనసును వదలటం లేదు. దాని కథ రేపుతున్న ప్రశ్నలు సమాధానమియ్య మంటున్నాయి –

'ఈ రోజు నువ్వు నన్ను చావమన్నావు రత్నా! నాదొక సమస్య కాదన్నావు! కనీసం రోగం కూడా కాదన్నావు!

స్వేచ్ఛ గురించి నా తండ్రి పెద్ద పెద్ద ఉపన్యాసాలు దంచుతూ నన్ను నిర్బంధంలో పెంచాడంటావు! స్వేచ్ఛ గురించి నాకు వెంపర్లాటే గాని దాన్ని సంపాదించుకునే దార్ఢ్యం

లేదంటావు! రాజుతో వివాహం గూడా స్వేచ్ఛా ప్రదర్శనమేనంటావు! అతనిచ్చిన స్వాతంత్ర్యాన్ని నేను దుర్వినియోగం చేసానంటావు.

వీటన్నింటికీ కారణం స్వేచ్ఛ మీద నా మిడి మిడి జ్ఞానమంటావు! వర్తమాన కాలంలో స్వేచ్ఛకి యిస్తున్న ప్రాధాన్యత ఏ తప్పుడు పనికయినా నాకు ధైర్యమిచ్చిందంటావు!

ఏమే రత్నా! యిన్ని మాటలు నన్ను అన్నావు! 'వ్యక్తి స్వేచ్ఛ' మీద నీకున్న కోపం నిన్ను గుడ్డిదాన్ని చెయ్యలేదా? లోకంలో ధనికులకూ, ధనిక దేశాలకూ భూమి మీద ఎక్కడయినా దోపిడీ చేసుకునే హక్కు నిచ్చే 'స్వేచ్ఛా వ్యాపార' ప్రచారానికి వ్యక్తి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అన్న పదాలు సైన్‌బోర్డుల్లా పనిచేస్తున్నాయని గదూ నీ కోపం? నిజంగా వ్యక్తులకు స్వేచ్ఛ లభించితే, అది పోయి పోయి లైంగిక వాంఛల కోసం కుటుంబాన్ని ధ్వంసం చేసే స్థితి వస్తుందని కదూ నీ ఊహ! నీ ఆరోపణ!

ఏమిటమ్మా - ఈ రోజు జరిగింది? నువ్వేం చూసావు?

ఉంటున్న యిల్లును కూల్చేసారు. భర్త ఆసుపత్రి పాలయాడు. ఒక్క గంటలో యిన్నేళ్ళ కష్టంతో సమకూర్చుకున్న వస్తువులు పోయాయి. అందుకని గోలు గోలున ఏడుస్తూ నీ సానుభూతిని సంపాదించుకుని, నా వంటి ఎన్నో ఏళ్ళ స్నేహితురాలిని కూడా నిర్దయగా నిందించటానికి పరోక్ష కారకురాలయిన ఆ మహిళ వేదన ఏం చెపుతున్నదో లోతుగా ఆలోచించావా రత్నా?

- కన్నడ భాష మాట్లాడే మీ మధ్య ఎన్నో ఏళ్ళుగా ఉంటున్నాను! నా పూర్వీకులూ, నేనూ యిక్కడ నీళ్ళు తాగాం. గాలి పీల్చాం. యిక్కడ భవంతులు కట్టాం. రోడ్లు వేసాం. పరిశ్రమలలో మీతో బాటు శ్రమించాం. ఇందులో విడదీయరాని భాగమయిపోయాం! నా పొరుగున ఉన్న నువ్వు వచ్చి, కత్తి తీసి, ఏదీ నీ తాళి చూపించు అన్నావు! నీది తమిళం తాళి - అంటూ తెంచి పట్టుకుపోతున్న వ్యక్తి! నువ్వు నన్నో సమూహంలో భాగంగా ముద్ర వేస్తున్నావు! నిన్నూ నన్నూ, మన వ్యక్తిత్వాలనూ, మంచీ చెడ్డా తత్వాలనూ, మనస్తత్వాలనూ అన్నింటినీ నాశనం చేసి నిన్నో గుంపుకీ, నన్నో గుంపుకీ అంటగట్టే ఈ సమాజాల భావనను మనం పూర్తిగా వదిలేద్దాం. దీనికి మార్గం ఒకటే! మనం వ్యక్తులుగా విడిపోవటం! వ్యక్తులుగా విడిపోతే మనం భాష పేరిట, మతం పేరిట కలవటముండదు. దేశం పేరిట కలవటం ఉండదు. జాతి పేరిట కలవటం ఉండదు. ఆయా పేర్లతో సాటి మనిషిని ముద్రించటం ఉండదు! ముద్రించి, వారిని ద్వేషించి, వారి మీదకు కత్తులు దూసి, బాంబులు పోసి, వారి రక్తకాసారంలో స్నానం చేసి ఈత కొట్టి గర్వించగలగటముండదు!

కనక రత్నా! ప్రతీ భావనకీ రెండో కోణముంటుంది! నీవు నన్ను నైతికంగా సమర్థించకపోవచ్చు! తాత్వికంగా నా గురించి యోచించకపోవటం సబబేనంటావా?

భర్తా, పురుషుడూ అయిన రాజు చూపిన పాటి సహనాన్ని చూపలేకపోయావు!

ఇన్నాళ్ళూ ఆదరించి, సమర్థించిన నువ్వే చావమంటే చావకుండా ఉంటుందా నీ యీ స్వేచ్ఛ?'

లేచి కూర్చున్నాను.

రాత్రి రెండవుతోంది. బయల్దేరాను. రాజు యింటికి చేరాను.

"ఏదీ స్వేచ్ఛ?" ప్రశ్నించాడు. రెండు చేతులతోనూ ముహం మూసుకున్నాడు. అతను వ్యక్తిగా ఆమెను ప్రేమించాడా? కుటుంబ మర్యాద కోసం ఆమె వెంట బడుతున్నాడా?

కొన్ని నిముషాల తర్వాత బయల్దేరాం! ఫోనులు చేసాం! బంధువుల ఇంట్లో గాని, స్నేహితుల యిళ్ళలో గాని లేదు. రాంబాబుని కలిసాం. అతని దగ్గరకీ రాలేదు. పోలీస్ రిపోర్ట్ యిచ్చాం. అనాధ శవాలను చూశాం.

ఈ జనారణ్యంలో స్వేచ్ఛ ఎక్కడా ధొరకలేదు!

ఆనవాళ్ళు కూడా దొరకలేదు!

రోజులు - వారాలయాయి! నెలలయాయి!

స్వేచ్ఛ నన్ను వెన్నాడుతూనే ఉంది.

ఒంటరిగా ఉన్నప్పుడు - ఆకాశంలో చుక్కల ప్రకాశం మాత్రమే చూపుకి సహకరిస్తున్నప్పుడు - నేను అనే ఉనికి మీద సంశయాలు పొటమరిస్తున్నప్పుడు - స్వేచ్ఛ నా చెవిలో గుసగుసలాడుతోంది.

నువ్వు నన్ను సమర్థించలేకపోయావు సరే - నా గురించిన ఆలోచన కూడా చేయలేకపోయావు!

---

ఇక్కడితో 'రచన', 'గడువు', 'అద్వైతం' - మూడు కథలు ముగుస్తున్నాయి. యీ మూడింటి మధ్యా సాంకేతిక పరమైన పోలిక ఒకటీ, వృత్తాంతపరమైన పోలిక ఒకటీ ఉన్నాయి. వాటిని పోల్చండి.

ఈ 'అద్వైతం' కథలో -

1. స్వేచ్ఛ పాత్రదీ ఒక సమస్యేనంటారా?

2. వ్యక్తి స్వేచ్ఛా సిద్ధాంతం, లైంగిక స్వేచ్ఛా భావనకు దారితీయగలదా?

3. సమూహభావనలు సృష్టించే సమస్యనూ, వ్యక్తి స్వేచ్ఛ సృష్టించే సమస్యనూ రత్న చూస్తున్నట్లు మీరూ చూడగలరా?

ఇలాంటి ప్రశ్నల ఆధారంగా కొంత క్లిష్టమైన ఈ కథని విశ్లేషించండి.

మీ అభిప్రాయాలు ఎంత చక్కనివయినా సకాలంలో అందాలి గదా! త్వరపడండి.

- రచయిత

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

అద్వైతం -

నిజమయిన 'వ్యక్తి స్వేచ్ఛ' సమసమాజంలోనే సాధ్యమనే వారికి 'రత్న', 'స్వేచ్ఛ' పాత్ర పట్ల సమంజసంగా ప్రవర్తించలేదన్నారు. ఆమె ఆ విధంగా ప్రవర్తించిన ఆనాటి ప్రత్యేక మానసిక స్థితిని వారు గమనించాలి.

పోతే -

'లైంగిక స్వేచ్ఛ' హేయమని విశ్వసించేవారు ఈ కథ దానిని సమర్థిస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్యానికి స్వేచ్ఛా వ్యాపారమే పరమౌషధంగా ప్రచారం చేస్తున్న దేశాలు - తమ కల్చరల్ ఆధిపత్యాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. ఆధునిక ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా లైంగికోద్రేకాలను రెచ్చగొట్టి.... మధ్య తరగతి ఆదాయ వర్గాల వారిని వశపరుచు కుంటున్నాయి. 'లైంగిక స్వేచ్ఛ' అర్థాన్నీ, అవసరాన్నీ గురించి ఆలోచించకుండానే అది ప్రాచ్య సంస్కృతికి విరుద్ధమనే వారు కూడా ఆ పరమౌషధాన్ని ఈ పంచదార పూతతో సహా అంగీకరించడమే పెద్ద ఐరనీ.

ఏమయినా -

వివాదాస్పద విషయమూ, సంక్లిష్ట కథనమూ గల 'అద్వైతం' మీద పాఠక మిత్రుల స్పందన - అద్భుతం! విషయాల పట్ల భేదాభిప్రాయాలు వ్యక్తమయినా, అందరూ చక్కని విశ్లేషణలు చేశారు. 'Keepwriting.. Intelligent people will understand' అంటారు టాల్‌స్టాయ్! 'రచయిత మిత్రులారా వ్రాయండి - తెలుగులో తెలివయిన పాఠకులకి కొదవలేదు' అంటున్నారు పాఠకులు. అన్ని సమీక్షలనూ ప్రచురించటం

సాధ్యపడదు గనుక వైవిధ్యత, నవ్యతల దృష్ట్యా ఈ క్రింది సమీక్షలని ఎంపిక చేయడం జరిగింది.

నచ్చిన అంశం : 1. ఎ.వి. రమణమూర్తి (న్యూఢిల్లీ) 2. ఎన్. హరికృష్ణ (హైదరాబాద్)

నచ్చని అంశం :1. డా.సి. ప్రతాప్ (హైదరాబాద్) 2. ఎ. సరళారాణి (మంగళగిరి)

'రచన', 'గడువు', 'అద్వైతం' కథలలో సామాన్యాంశాలు - (1) ఉత్తమ పురుషలో చెప్పటం (2) పురుషుని లైంగిక బలహీనత సమస్యకు ముగ్గురు స్త్రీల స్పందన. ఈ విషయాన్ని పోల్చిన వారు: 1. రవి, రవిచంద్ర (దాచేపల్లి) 2. డా. యం. విజయగోపాల్ (హైదరాబాద్)

నచ్చిన అంశం

### ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

"అద్వైతం" పాఠకుణ్ణి కూడా కథలోని సంఘర్షణలోకి లాగి, ఆలోచింపజేయగలగడం దృష్ట్యా మంచి కథ. రచయిత(త్రి) వాడిన భాష, శైలి, వాడుకున్న భావాలు - యివన్నీ కథకి సరైన హంగుల్ని సమకూర్చాయి.

'వ్యక్తి స్వేచ్ఛ' అనే సమస్య ప్రధానంగా తీసుకోబడ్డ ఈ కథలో, పాత్రలు అసలీ స్వేచ్ఛ గురించి యేమనుకుంటున్నారూ అనేది ప్రస్తావించకుండా, ఆ స్వేచ్ఛ వాళ్ళ కుందీ అనే ప్రాతిపదిక మీద పరిణామాల్ని వివరించడం జరిగింది. అయితే, యీ వ్యక్తి స్వేచ్ఛ గురించి స్వేచ్ఛకీ, రత్నకీ ఉన్న అవగాహన వేరు. స్వేచ్ఛ ఎంతసేపూ వ్యక్తి స్వేచ్ఛ అంటే యేమిటో తెలీకుండా, దాన్ని వాంఛించి, తను చేస్తున్న దాన్ని ఆ చట్రంలోకి బిగించ బోయింది. కాగా రత్నకి కొన్ని సిద్ధాంతపరమైన అభిప్రాయాలున్నాయి. కాకపోతే, యిద్దరి విషయంలోనూ యీ స్వేచ్ఛ లైంగిక దిశగానే సాగిపోయింది. స్వేచ్ఛ విషయంలో ఉక్రోషం, యిన్‌సెక్యూరిటీ కారణంగా; రత్న విషయంలో అభిప్రాయాల ముసుగులో, జస్టిఫికేషన్ల తొడుగుతో లివింగ్ - యిన్‌గా. సెక్స్ అనేది ఎప్పటికైనా - టాబూలా కాకుండా - కాజువల్‌గా తీసుకోగలిగిననాడే వ్యక్తి స్వేచ్ఛ గురించి మాట్లాడగల ప్రాథమిక స్థాయి వస్తుంది. దాన్ని యిన్‌హిబిషన్‌గానో, సాహసంగానో - అసలా విషయం లేదా సమస్య లాగా - తీసుకున్నంత కాలం అన్ని సంబంధాల్లోనూ అదే ప్రథమ పాత్ర వహిస్తుంది. అదే మొదటి, చివరి సమస్యవుతుంది.

స్వేచ్ఛ సమస్యకి మూలం ఆమె చిన్నతనంలో - ఫాదర్ - యిమేజ్ పట్ల యేర్పడ్డ నెగటివ్ ధోరణిలో దాగి ఉంది. ఆ కారణంగానే వాళ్ళ నాన్న ఊహించిన దానికి విరుద్ధంగా సాహసం చెయ్యాలనుకోవటం, రాజు మీద పూర్తి కంట్రోల్ ఉండాలనుకోవటం, లేకపోతే ఫ్రస్ట్రేట్ కావడం. రాజు ఎప్పుడైతే యిండిపెండెంట్‌గా ప్రవర్తించడం మొదలు పెట్టాడో

అప్పట్నుంచి తన యిన్‌సెక్యూరిటీస్ ప్రారంభమై, దాన్ని సెక్స్ సమస్య కింద మార్చి, చివరికి రాంబాబుతో పరిచయం చేయించాయి. రాంబాబు కేవలం సబ్‌స్టిట్యూట్‌గా భావించబడ్డాడే తప్ప, యేమాత్రం ఓ ఎక్స్‌టెన్షన్‌లా కాదు. ఏ రిలేషన్‌షిప్ అయినా యింకోదానికి ప్రత్యమ్నాయం కాకపోవడమే అసలైన వ్యక్తి స్వేచ్ఛ. కాకపోతే, చేసేపనిలో చాలా కన్విక్షన్, యింకా చాలా - తన మీద తనకి - బాధ్యత కలిగి ఉండటాలు అదనపు అవశ్యకాలు.

ఈ స్వేచ్ఛ సమస్య పట్ల రత్నకి - తను చెప్పే సోకాల్డ్ దోపిడీ సిద్ధాంతాల్నీ, తాగే సిగరెట్లనీ, బీర్ పిచర్‌లనీ వదిలేసి ఆలోచించినా (... అనేది విష్‌ఫుల్ థింకింగ్ - రత్న అసలు ఒక్క సిద్ధాంతాన్నీ వదిలిపెట్టలేదు యే సమస్యనైనా చర్చించే ముందు..) తనకు చిన్నప్పట్నుంచీ ఎంతో తెలిసిన స్వేచ్ఛ సమస్య పట్ల యే మాత్రం అవగాహన ఉన్నట్టు? ఏమాత్రం కౌన్‌సెలింగ్ చేసినట్టు? ఓ వేళ తను చేయలేకపోయినా - యే సైకియాట్రిస్ట్ దగ్గరకో ఎందుకు తీసుకువెళ్ళనట్టు? తన దోపిడీ సిద్ధాంతాలకీ, కుహనా మేధస్సుకీ స్వేచ్ఛని బలిపెట్టి, ఓ వ్యక్తి సమస్య పట్ల కొంచెం ఆబ్జెక్టివ్‌గా వుండలేక దాన్ని కావేరీ జలాలకి బలైపోతున్న వాళ్ళ కన్నీళ్ళ సమస్యల భూతద్దాల ద్వారా (మళ్ళీ యిక్కడ వ్యక్తి ముఖ్యం కాదు, సమాజం ముఖ్యం, జర్నలిజం ముఖ్యం అనే సమర్థింపుతో. అవే ముఖ్యమనుకుంటే, రత్నకి అసలు స్వేచ్ఛ స్నేహితురాలేనా?) చూసి, 'నీ చావు నువ్వు చావు' అని చెప్పేయడం! ఈ మాత్రం దానికి మార్క్సులూ, సార్త్రేలూ, జిడ్డు కృష్ణమూర్తులూ ఎందుకు? కన్‌ఫ్యూజన్‌లో పడికొట్టుకుపోతున్న వాళ్ళకి కొంచెం ఆత్మీయత, కొంచెం హ్యూమనిస్టిక్ అప్రోచ్ - ఎంతో ఓదార్పునిస్తాయని, బహుశా రత్న లాంటి రంధ్రాన్వేషణ చేసే వాళ్ళకి ఎప్పటికీ తెలీకపోవచ్చు. స్వేచ్ఛ తన సమస్యని కావేరీ జలాల సమస్యలతో ముడిపెట్టి ప్రశ్నిస్తున్నట్టు రత్న ఊహించుకోవడం రత్న తాలూకు తీవ్రవాద ధోరణినీ, వేరేవాళ్ళ సమస్యల్ని మనకి మనం యింటలెక్ట్యువలైజ్ చేసి ఆలోచించుకుంటూ ఆనందించే ధోరణినీ మాత్రమే వెల్లడిస్తుంది. వ్యక్తులు సమూహంలోంచి చాలామంది వ్యక్తులుగా విడిపోడానికీ (అదసలు సంభవం కాదు. ప్రతి వ్యక్తికీ సమాజం అనేది ఓ ప్రామాణికంగానో, ఓ ఆలంబనగానో, ఓ ఏమర్శావేదికగానో - ఓపాయింట్ ఆఫ్ రిఫరెన్స్ లేదా పాయింట్ ఆఫ్ బిలాంగింగ్‌నెస్‌గానో కావాలీ అనుకుంటాడు), స్వేచ్ఛ సమస్యకీ అసలు పొంతన లేనే లేదు.

రచయిత (త్రి) యీ కథని రత్న పరంగా చెప్పటంలో ఓ ఉద్దేశం ఉందనిపించింది. ఓ వేళ ఓ అభిప్రాయం అసంబద్ధంగా, కాంట్రడిక్టరీగా ఉంటే దాన్ని రత్న పరం చేయడానికీ, యింకో అభిప్రాయం 'ఓహో.. శభాష్' అన్పించేలా వుంటే దాని క్రెడిట్ తను తీసుకోవడానికి

చేసిన ప్రయత్నంలా అనిపించింది. అయితే, ప్రతి ఎదుగుదలకీ సంఘర్షణా, కాంట్రడిక్షన్స్ చాలా అవసరం అనేది చక్కగానే చెప్పగలిగారు.

కాకపోతే, రత్నా, రచయితా యిద్దరూ తెలుసుకోవాల్సిన విషయం : జీవితం కంటే సిద్ధాంతాలు యెప్పటికీ గొప్పవి కావు – ఓ చోట పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు చెప్పినట్టు.

– ఎ.వి. రమణమూర్తి

ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

స్వేచ్ఛకి అంతం యెక్కడ?

స్వేచ్ఛ తనంతట తాను అంతమవదు. ఎక్కడో ఒకచోట దానికో కృత్రిమమైన అడ్డంకి కల్పించాలి.

నైతిక ధర్మం, బాధ్యత వ్యక్తి స్వేచ్ఛ చుట్టూ ఒక గిరి గీస్తాయి. స్వేచ్ఛా ప్రియత్వపు తపన అంతా ఈ బంధం నుండి విముక్తి కొరకేనన్నది నిర్వివాదాంశం.

అసలు నియంత్రణ అనేది ప్రకృతి సహజమైన విషయం. ప్రకృతిలో పుట్టుకొచ్చిన విభిన్నమైన జంతుజలాలు పరస్పరం స్వేచ్ఛకు కళ్ళాలు వేస్తుంటాయి. తన కంటే బలమైన మరో ప్రాణి నుంచి తన్ను తాను కాపాడుకోవాలంటే తమలో తాము ఒక కట్టుబాటుకు రాక తప్పదని ప్రాణికోటి గ్రహించింది. ఈ అవగాహనలోంచే సంఘజీవనం, నాగరికత అభివృద్ధి చెందినాయి. ప్రస్తుత సమస్యను ఈ దృక్కోణం నుండి గనక పరిశీలించినట్లయితే–

1. స్వేచ్ఛది ఖచ్చితంగా ఒక సమస్యే కానీ అది సామాజిక సమస్య కాదు – స్వేచ్ఛ ఎదుర్కొన్న సమస్య పట్ల మనం సానుభూతి చూపించవచ్చు కాని, ఆ జాలి ఒక పేషెంట్‌పై చూపే జాలి వంటిదే అయి వుండాలి.

కాలానుగుణంగా, వయస్సు పెరిగి బాధ్యతలు నెత్తిన పడ్తున్న కొద్దీ... వ్యక్తి స్వేచ్ఛని కొద్ది కొద్దిగా త్యాగం చేయటం సంఘజీవి లక్షణం. యవ్వనంలో ఊరించే సెక్సువల్ ఫాంటసీలన్నీ నెమ్మదిగా కరిగిపోయి ఒక లక్ష్యం కోసం, స్టేటస్ కోసం మగవాడు శ్రమిస్తాడు (ఈనాడు స్త్రీలు కూడా). అందువలన సెక్సులో ఆసక్తి తగ్గటం చాలా సహజం. అందుకు తగ్గట్టుగానే తన భాగస్వామి కూడా ప్రవర్తిస్తూ అతని లక్ష్యసాధనలో ప్రోత్సాహం ఇవ్వాలి. అదే పని 'స్వేచ్ఛ' తల్లిదండ్రులు చేయకుండా వుండి వుంటే, ఆవిడగారిలా సెక్స్‌ని సిద్ధాంతీకరిస్తూ కూచోగలిగి ఉండేది కాదేమో! కాబట్టి స్వేచ్ఛది ఒక యునీక్ కేస్ అని భావించవచ్చు. తనని 'నింఫోమానియక్' అంటే స్వేచ్ఛకి ఇష్టం వుండదు. నిజానికి ఆమెను ఆ మాట అననవసరం లేదు. తనని ఒక 'హెడోనిస్ట్'గా అర్థం చేసుకుంటే సరిపోతుంది.

2. వ్యక్తి స్వేచ్ఛలో లైంగిక స్వేచ్ఛ ఒక భాగం. వ్యక్తి స్వేచ్ఛ పరమావధి లైంగిక

స్వేచ్ఛ కాదు. వ్యక్తి స్వేచ్ఛ లైంగిక స్వేచ్ఛకి దారితీసి సంసారాలు కూలిపోతాయని రత్న ఒక దశలో భావించినట్టు జనరలైజ్ చేయలేము. అమెరికా, యూరప్ దేశాలలోని లైంగిక స్వేచ్ఛ అక్కడి కాపురాలనేమీ కూల్చటం లేదు. కూలినా అక్కడది జీవన్మరణ సమస్య కాదు. కాని మన దేశంలో వున్నట్టుగా అక్కడి కుటుంబ సంబంధాలు, ప్రేమానురాగాలు పరిష్టంగా లేవన్నది స్పష్టం. అన్నీ వున్నా మనశ్శాంతి కరువయి ఫ్రస్టేట్ అవుతుండేవాళ్ళు అక్కడ కోకొల్లలు. ఇటీవల తల ఎత్తిన ఇతరత్రా (ఎయిడ్స్) పరిణామాల దృష్ట్యా చూసినా లైంగిక స్వేచ్ఛకు కళ్ళాలు వేయవలసిన అవసరం బోధపడుతుంది.

3. పై కారణాల వలన రత్న మొదట్లో అభిప్రాయపడ్డట్టు వ్యక్తి స్వేచ్ఛను నియంత్రించక తప్పదు. ఆ నియంత్రణలోనే వ్యక్తి మనుగడకి హామీ వుంది. కావేరీ కల్లోలం ప్రస్తావించి ఇదేనా రక్షణ? అని నిలదీయవచ్చు కానీ అవన్నీ తాత్కాలిక ఒడిదుడుకులు. కావేరీ గురించి కొట్లాడుకున్న ఈ రెండు సమూహాలే, బయటి దేశాన్ని ఎదుర్కొవలసి వచ్చినపుడు ఏకమవుతాయి. ఈ రెండు సమూహాలలోను తిరిగి అనేక అంతర్గత సమూహాలుంటాయి. ఇద్దరు వ్యక్తులు ఒక తీరుగా వుండనట్లే రెండు సమూహాలు కూడా ఒకలా వుండవు. ఈ కల్చరల్ డిఫరెన్సెస్ అనివార్యమైనవి. ప్రతి రెండు సమూహాలు తమ స్వేచ్ఛలని పరస్పరం గుర్తించుకునే బాధ్యతని విస్మరించినప్పుడే ఘర్షణ తలెత్తుతుంది. ఇది తాత్కాలికమే. భూప్రకంపనలు వస్తాయని భూమండలాన్ని వదిలిపెట్టి వెళ్ళలేం కదా. కాబట్టి చివర్లో రత్న 'కన్విన్స్' అయినట్లుగా సమూహ స్వేచ్ఛ యొక్క ప్రాధాన్యతని విస్మరించలేము. వ్యక్తి స్వేచ్ఛని మాత్రం నేడున్న పరిస్థితుల్లో అదుపు చేయక తప్పదు.

ఈ కథని సమీక్షించి ఒక్కసారి చూసుకుంటే సమీక్షించటానికి రచయిత ఏమీ మిగల్చలేదనిపించింది. ఆయా సమస్యలపై చాలా సమర్థవంతమైన చర్చను రచయితే కథలో చూపించారు. అయితే కథలో కావేరీ కల్లోల ప్రస్తావన అంత బలంగా లేకపోవటం వలన, ఒక కథ చదివానన్న దానికంటే ఒక తర్కం చదివానన్న అనుభూతి కలిగింది.

– నిభానుపూడి హరికృష్ణ

**నచ్చని అంశం**

**ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ**

ఈ నెల (జూన్ '92) 'కథాప్రహేళిక'లో చోటు చేసుకొన్న "అద్వైతం" కథలో ఏ మాత్రమూ నచ్చని అంశం – లజ్జారహితమైన పాశ్చాత్య అనుకరణ. ఈ అనుకరణ కథాకథనంలోనూ, కథ అద్యంతమూ వ్యక్తమయ్యే 'తాత్వికత'లోనూ ప్రస్ఫుటంగా గమనించవచ్చు. కథాగమనంలో కోకొల్లలుగా పొందుపరచబడిన సమకాలీన సమస్యలు, వాటి పట్ల అనుసరించిన ఆధునిక దృక్పథాల చాటున కొంత సృజనాత్మక వంచన

కనిపిస్తుంది. నిజానికి అసంఖ్యాకాలుగా స్ఫురణకు తేబడిన సమస్యలు, వాటి సంక్షిప్త విశ్లేషణలు ఒక నిర్దుష్టమైన అవగాహనకు తోడ్పడవు సరికదా ఆగమ్య గోచరతకు, కర్తవ్య విమూఢతకు దారితీస్తాయి. ఇటువంటి పరిస్థితి మేధను స్తంభీకృతం చేసి, మానవ బలహీనతలను రెచ్చగొట్టే ప్రమాదం ఉంది. నిజానికి ప్రస్తావితమైన భావాల గంభీరత, వాటికి ఆపాదించబడిన ఆధునికత హేయమైన విశృంఖల తత్వానికి సైద్ధాంతిక ప్రతిపత్తిని కట్టబెట్టే ప్రమాదమూ వుంది.

రచయిత(త్రి) ఎన్నుకున్న కథన సంవిధానం Impressionist Narration అంటే, వైవిధ్యం గల భావ సంచయాన్ని అసంఖ్యాకంగా - కాని సంక్షిప్తంగా - కథాగమనంలో పొందుపరచి పాఠకుని సమ్మోహితుని చేయనుద్దేశించే కథన విధానమన్న మాట. "అద్వైతం" కథలో ఇతివృత్తం స్థూలంగా "వ్యక్తి స్వేచ్ఛ" అనుకుంటే, రచయిత (త్రి) స్పృశించిన ఇతివృత్తాంశాలు మాత్రం అనేకం. అందులో కొన్ని వ్యక్తి స్వేచ్ఛను విభిన్న దృక్కోణాల నుండి పరిశీలిస్తున్న భ్రమను కలిగించేవి - లైంగిక స్వేచ్ఛ, వివాహం - లైంగిక స్వేచ్ఛ, సామ్యవాదం - లైంగిక స్వేచ్ఛ, విశృంఖలత్వం - వ్యక్తిత్వం, కుటుంబం, స్వేచ్ఛ, సాంఘిక భద్రత, నిర్ణాయక స్వేచ్ఛ వగైరాలే కాకుండా రాజకీయ పరిణామాలు, సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం, వ్యక్తి - సమూహితత్వం, స్త్రీ వాదం, పతనాసక్తి - ప్రయోజనాలు ఇత్యాది ఎన్నో ఇతివృత్తాంశాలు కూడా కథాగమనంలో చోటు చేసుకోవటం గమనించవచ్చు. అంటే, ఆధునిక జీవన విధానాన్ని సూచించే అంశాలు, సమకాలీన దృక్పథపరంగా విశ్లేషణ యోగ్యాలైన అంశాలు - ఎన్ని వీలైతే అన్నీ కథాగమనంలో పొందుపరచబడ్డాయి. అయినప్పటికీ, సమగ్రమనిపించే యీ పరిశీలనకు సరైన సైద్ధాంతిక ధృఢత్వం గాని, నైశిత్వం గాని యివ్వడంలో రచయిత (త్రి) కృతకృత్యులు కాలేకపోయారు. కథాంతంలో స్వేచ్ఛ అంతర్ధానం (వ్యక్తి) స్వేచ్ఛ పట్ల రచయిత (త్రి) ఒక నిర్దుష్టమైన అవగాహనను ఏర్పరచుకోలేకపోయారన్న విషయాన్ని సూచిస్తున్నది. మరి గుణ నిర్ధారణకు దారితీయని, గౌణంగా ప్రస్తావితమై, అసంఖ్యాకంగా పొందుపరచబడిన సమకాలీన సమస్యల వునికిని సమర్థించడమెలా? దీనికి కారణం కేవలం పాఠకులను సమ్మోహితులను చేయడమే అయితే, కథ శిల్పరాహిత్యం అయిపోయే ప్రమాదం వుంది. మరి కథా శిల్పాన్ని భావించుకుంటే, కథా సంవిధానంలో ఈ గౌణ ప్రస్తావనలకు నిర్దుష్టమైన పాత్ర నిర్దేశించవలసి వుంటుంది. పైగా, ఈ రెండు ప్రతిపాదనలు పరస్పర విరుద్ధాలు కావు. పరస్పర పూరకాలే. ఈ గౌణ ప్రస్తావనలు నిర్వహించే పాత్ర ఏదైనప్పటికీ, పాఠకుని దృష్టిని ఆకట్టుకోవడం ద్వారా ఆ పాత్రను మరింత సమర్థవంతంగా పోషించగలిగే అవకాశం ఉంది.

ఆధునికము, విజ్ఞానవంతము అయిన ఆలోచనా సరళిని స్ఫురింపచేసే ఈ గౌణ ప్రస్తావనలు సహజంగానే మేధాపరము, హేతువాద బద్ధమూ అయిన, ఇదమిద్ధమని తేల్పలేని ఒక కృత్రిమ వాతావరణ సృష్టిని సాధ్యపరుస్తాయి. ఇటువంటి వాతావరణం అస్పష్టము, అనిర్ధష్టమే అవుతుంది. ఎందుకంటే, విద్యావంతుడైన పాఠకుడు కూడా సమకాలీన పరిస్థితులపై, అవి వుత్పన్నం చేసే వైజ్ఞానిక పరిశోధనలపై కూలంకషమైన పరిజ్ఞానాన్ని కలిగి వుండడం చాలా అరుదు. పైగా, కథా గమనంలో కొల్లలుగా "తగిలే" ఈ సమస్యలపై ఆగి, విశ్లేషించి, విభిన్నాంశాల మధ్య సంబంధాలు పూర్తిగా అవగాహన చేసుకునే సమయం పాఠకునికి ఉండదు. ఉన్నప్పటికీ సాహిత్య లక్షణం అది కాదు. కథకుడు చెప్పదలచుకొన్న దానిని తెలుసుకోవడమే పాఠకుని ప్రథమోద్దేశం. ఆ మేరలోనే ఎన్ని విశ్లేషణలు జరిపినా కూడా. పాఠకుని దృక్కోణం నుంచి కూడ సవివరము, సమగ్రము అయిన వైజ్ఞానిక పరిశోధనల వంటి పరిశీలనలకు తావు లేదు. అటువంటి పరిశీలనలకు వైజ్ఞానిక గ్రంథాలున్నాయి. తాత్విక గ్రంథాలున్నాయి. మరైతే, రచయిత(త్రి) సృష్టించిన ఈ భావ పటాటోపానికి కారణమేమిటి? విజ్ఞానవంతము, మేధాపరమూ అయిన వాతావరణ సృష్టి దేనికి వుద్దేశించబడింది?

పై ప్రశ్నలకు సమాధానాలు కథలో తర్కించబడ్డ ప్రధాన సమస్య పరంగా ఆలోచిస్తేనే విదితమౌతుంది. కథలో స్వేచ్ఛ అన్నట్లుగా, ఆ సమస్య, "నైతికంగా సమర్ధనీయం కాకపోయినా, తాత్వికంగా నైనా 'వ్యక్తి స్వేచ్ఛ' (విశృంఖలత) గురించి యోచింపజేయడం". కాని, వ్యక్తి బలహీనతలను రెచ్చగొట్టి, ద్వంద్వ జీవన శైలికి దారితీసే హేయమైన నడవడికను సమర్ధించడమెలా? వ్యక్తి సమగ్రతను హరించి, స్వేచ్ఛ - హక్కులు - అధికారాల ముసుగులో స్వప్రయోజనాన్వేషణను ప్రేరేపించే విధానానికి న్యాయత్వ మాపాదించడం ఎలా? వ్యక్తిని వినియోగ వస్తువుగా మార్చి అతనిని లోబర్చుకొనడానికి జరిగే కుయుక్తులను సమ్మతించేదెలా? ఇంతటి హేయమైన నడవడికకు (విశృంఖలతకు) గౌరవనీయత నాపాదించనుద్దేశించిన కృషే "అద్వైతం" కథ. ఆధునిక ఆలోచనా సరళి, వైజ్ఞానికమూ హేతుబద్ధమూ అనిపించే పరిశీలనలు, అమూర్తము, మేధాపరము అయిన విశ్లేషణలతో నిండిన గౌణ ప్రస్తావనలు నిర్వహించే పాత్ర విశృంఖలతకు గౌరవనీయత నాపాదించడమే. వజ్రం సరసన వున్న గాజు ముక్క వజ్రకాంతులను ప్రతిఫలించినట్లు, ఉత్కృష్టమైన నేపథ్యంలో పొందుపరచి, హేయమైన విశృంఖలతను ఆధునికతా లక్షణంగా అంగీకరించపచేయడమే రచయిత(త్రి) వుద్దేశంగా కనబడుతున్నది. నిజానికి కొల్లలుగా ప్రస్తావితమైన విషయాల విశ్లేషణ క్లుప్తాలే కాకుండా, క్లుప్తమైన ఆ విశ్లేషణలను కూడా కథాగమనంలో కరిగిపోనిచ్చారే తప్ప, రచయిత(త్రి) వాటికి క్రమబద్ధంగా వాడుకొని

"వ్యక్తి స్వేచ్ఛ" లేదా "విశృంఖలత" పట్ల ఒక నిర్దుష్టమైన అవగాహనను లేదా అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నించలేదు.

నవ్యత కొరకో, ఆధునికతా లక్షణమనుకొనో పాశ్చాత్య కథన శైలిని అనుకరించ తాపత్రము పడే రచయిత(త్రు)లు ఈ సంస్కృతీ విభేదాన్ని గుర్తుంచుకొనటం మంచిది. పాశ్చాత్య తత్వం (తాత్వికత కూడా) విశ్లేషణ శీలం (ఎనలిటికల్). భారతీయ తత్వం సంశ్లేషణాత్మకం (హోలిస్టిక్). విశ్లేషణ శీలత వ్యూహాత్మకతకు, తద్వారా కార్యశీలతకూ దారి తీస్తుంది. సంశ్లేషణాత్మకత గుణ నిర్ధారణ (వేల్యూ జడ్జిమెంటు)ను కోరుతుంది. సంశ్లేషణాత్మకతతో అంతర్గతంగా విశ్లేషణాత్మకత వున్నప్పటికీ, అటువంటి విశ్లేషణ గుణ వాస్తవికతను స్పష్టపరచడానికి వుద్దిష్టమైనది. పాశ్చాత్య సంస్కృతిలోని విశ్లేషణ శీలత కార్యసాధనకు వుద్దేశింపబడడంతో వ్యూహాత్మకత ద్వంద్వ వైఖరిని సంతరించుకొనే ప్రమాదం వుంది. అటువంటి ఒక ద్వంద్వ వైఖరి అనువర్తననే "అద్వైతం" కథ సోదా హరణంగా ఉపపాదిస్తున్నది. అందువలననే అది సంస్కృతీ బాహ్యము, జుగుప్సాకరమూ కూడా అవుతుంది. అంటే, మన కథన విధానాలు సహజము, స్వాభావికము అయిన పరిణామాలు చెందాలంటే అవి సంస్కృతీ బద్ధం కావాలి. కథా సంవిధానంలో ప్రయోగాలు గుణ నిర్ధారణ గీటురాయిగా మోసులెత్తాలి.

– డా. సి. ప్రతాప్

### ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

ఇంత చిక్కు రొక్కురు కథ యీ మధ్యకాలంలో చదవలేదు. కథ చెప్పే రత్న పాత్ర ధోరణి చాలా గందరగోళంగా వుంది. రత్న స్వేచ్ఛని వ్యతిరేకించినా, ఆమె ఆలోచనా ప్రవంతి స్వేచ్ఛని సమర్థించేదిగా ఉంది. అందుకు ఆమె ఎన్నుకున్న సమూహాల భావన పాఠకుల్ని తప్పుదారి పట్టించేదిగా ఉంది. పైగా 'మొగుడు సంపాదించి, పిల్లలు చదువుకుంటూ అంతా హాయిగా వున్నప్పుడు స్త్రీలు కొవ్వు పట్టి వాంఛలకీ, రోగాలకీ లోనవుతారనే' ఆమె ఆలోచనా ప్రవంతి అభ్యంతరకరమైనది. 'పేదరికమూ, అసహాయత్వమూ స్త్రీలను పవిత్రం(?)గానూ, పతివ్రతలుగానూ వుంచుతుంది. అది సమర్ధనీయమన్న ఆమె వూహ హాస్యాస్పదమైంది. స్వేచ్ఛని వ్యతిరేకించడానికి ఆమె చెప్పిన యీ కారణాలు నమ్మదగ్గవి కాక పాఠకుడ్ని స్వేచ్ఛ కుహనా స్వేచ్ఛకి దగ్గర చేస్తాయి. అయితే కుటుంబంలో తల్లీదండ్రుల, కొడుకుల యిష్టాల కనుగుణంగా కొంత సర్దుకుపోవాల్సి వుంటుందన్న ఆమె ఆలోచన కుటుంబ వ్యవస్థను బలపరిచేదిగా, ప్రేమ ఆప్యాయతల మీద కుటుంబాన్ని పునర్నిర్మించేదిగా వుంది. కుటుంబమూ సమాజమే అన్న భావన తెలిసిందే అయినా మళ్ళీ తెలియజెప్పినట్లయింది. వ్యక్తులు సమాజంలో

భాగంగానే బ్రతకాలి - అనుగుణంగానే బ్రతకాలి అని స్పష్టం చేసినట్లయింది. ఇది వాంఛనీయమైన వాదన! హరి సాంగత్యంలో విశాలంగా ఆలోచించటం నేర్చిన రత్నకి జర్నలిజం వృత్తిగా, వ్యాపకంగా కొంత సరిపోయినట్లుంది. కానీ ఆమె ఫ్రీ లైఫ్‌లో పరిపూర్ణత లోపించినట్లుంది. అందుకే స్వేచ్ఛ విషయంలో ఆమెకు కలిగిన భిన్న భిన్న భావాలూ, వూహలూ, ఆలోచన్లూ, అపరిపక్వంగా వున్నాయి. యేమైతేనేం స్వేచ్ఛకు వ్యతిరేకంగా ఆమె చేసిన వోటు సత్ఫలితాలనే యిస్తుంది.

ఇక స్వేచ్ఛ విషయానికొస్తే నిజంగానే రత్న చెప్పినట్లే వూహలను సిద్ధాంతీకరించుకుని, సిద్ధాంతాలను వక్రీకరించుకుని జీవితాన్ని స్వేచ్ఛానుసారంగా భ్రష్టుపట్టించుకున్న పాత్ర. రాజుని కాక ప్రేమించానన్న భావనని ప్రేమించే స్వేచ్ఛ రాజు దగ్గరైన కొద్దీ, అతని లోని లోపాలు బయటపడిన కొద్దీ - వ్యక్తి స్వేచ్ఛ ప్రాతిపదికపై కుటుంబం మొత్తాన్ని, తద్వారా సమాజాన్ని త్రోసిపుచ్చి తన దారి తాను చూసుకుంది. 'నిజమైన ప్రేమ' యిలా వుండదు. రాజులోని లోపాన్ని తన శాయశక్తులా పరిష్కరించడానికి ప్రయత్నించాలి. ఒకప్పుడు సెక్సులో ఆనందాల ఎత్తులనూ, లోతులనూ పరిచయం చేసి, 'రాజుతో సెక్సు సుఖం కన్నా జీవితంలో కావల్సింది యేముంది' అన్పించేంతగా తృప్తి పరచిన రాజుని తృణీకరించటం - వాడుకున్నంత కాలం వాడుకుని వట్టిపోయిన పశువుని కసాయి వాడికి తోలినట్టైంది. అలాగే రెండో ప్రేమగా 'రాంబాబు యిచ్చే సుఖం ముందు అన్నీ వ్యర్థం' అన్న స్వేచ్ఛ - రేపు రాంబాబుకి పెళ్ళై, పిల్లలు పుట్టి తన దారి తాను చూసుకోవటమూ లేక అతనిలోనూ సెక్స్ బలహీనత యేర్పడటమూ జరిగితే స్వేచ్ఛ - మళ్ళీ మూడో ప్రేమగా 'మరో సోంబాబు'ని ఆశ్రయించాలి! స్వేచ్ఛ వ్యక్తి స్వేచ్ఛ, లైంగిక స్వేచ్ఛా భావనకు దారి తీస్తుంది. అది తర్వాతర్వాత అపరిమితమైన మైధునేచ్ఛగల మానసిక రుగ్మతగా మారనూ గలదు. అయినా అటువంటి నింఫోమేనియానే - కొన్ని సైకో ఎనలిటికల్ తెరపీ రీతుల ద్వారా నయం చేసే అవకాశం వున్నప్పుడు ప్రారంభదశలో వున్న స్వేచ్ఛ లైంగిక భావనా స్వేచ్ఛను సరైన శాస్త్రీయమైన ఆలోచనా ధోరణితోనూ, మానసిక వైద్య రీతులతోనూ మార్చుకునే అవకాశం వుండీ మార్చుకునే ప్రయత్నం చేయపోవటం రత్న చెప్పినట్టు ఎలాంటి ఆలోచన చేయడానికైనా వున్న వ్యక్తి స్వేచ్ఛ నినాదమూ; కప్పుకోవటానికి వున్న సిద్ధాంతాల దొంతరులూ! కాబట్టి స్వేచ్ఛ కున్న పునాదులు అలాంటివి. ఆమె దేన్నయినా వాడుకోగలదు. ఆమెను ఎవరైనా వాడుకోగలరు.

రాజు విషయానికొస్తే అతడి పట్ల సానుభూతి కలుగుతుంది. డబ్బు కోసం కాక ఆదర్శాల కోసం సాహసం చేసిన రాజు - దేశంలో వున్న విద్యావంతుల ఆత్మవిశ్వాసరాహిత్యాన్ని ఎత్తి చూపిన రాజు - మెషీను పనిచేయటమెలాగో చెప్పగలిగి,

పని చేయించడానికి ప్రయత్నించని మేధో నపుంసకత్వాన్ని ఎండగట్టిన రాజు తన పనిలో, శ్రమలో ఏకాగ్రత, నిమగ్నత కలిగి ఇతరేతర విషయాలపట్ల తూష్ణీ భావము, నిరాసక్తత కలిగి వుండడం అతడిలో తపన్ని, పట్టుదలని సూచిస్తుంది. అర్థం చేసుకోలేని, తదనుగుణంగా నడుచుకోలేని భార్య పట్ల సహజంగా వచ్చే నిర్లిప్తత, కాంక్ష లేకపోవటం, ప్రేమ మోహరాహిత్యము - సెక్సు సహించనంతగా ఎదిగి స్వేచ్ఛ స్వేచ్ఛకి వూపిరి పోసింది. (రాజు పాత్రని చిత్రించటంలో రచయిత(త్రి) అదే నిర్లక్ష్యాన్ని, అనాసక్తిని ప్రదర్శించి అన్యాయము చేశారు!) ఒకప్పుడు స్వేచ్ఛ శరీరాన్ని, సర్వం సహాచక్రవర్తిలా పాలించి సెక్సు ఆనందం ఎత్తులను, లోతులను చవి చూపించి 'రాజుతో సెక్సు కన్న ముఖ్యమైంది ఏముంది?' అన్పించుకున్న రాజు చివరికి 'ఏది స్వేచ్ఛ?' అని పరితపించటం అతని పట్ల సానుభూతిని కలిగిస్తుంది. మేధోవలసని, మేధోనపుంసత్వాన్ని నిరసించిన రాజు నిజంగా మగాడు. సర్వంసహా చక్రవర్తి! సూత్రధారుడు.

సమూహాల భావన గూర్చి స్వేచ్ఛ ప్రశ్నిస్తున్నట్లుగా రత్న భావన గొప్ప ఫాంటసీ! మనిషి మంచి చెడ్డా తత్వాలను మనస్తత్వాలను అన్నింటినీ నాశనం చేసే సమూహాల భావన వదిలేసి వ్యక్తులుగా విడిపోదామందట స్వేచ్ఛ - రత్న భావనలో! అయితే మనుషులు వ్యక్తులుగా విడిపోవటం అన్నా - భిన్న సమూహాలుగా, గుంపులుగా కాక ఒకే సమూహంగా గుంపుగా వుండడం అన్నా ఒకటేనన్న భావం రత్నకు స్ఫురించకపోవటం ఆశ్చర్యం, నేరం! వర్గరహిత సమాజంలో మాత్రమే వ్యక్తి వ్యక్తిగా మనగలుగుతాడు. అక్కడ మాత్రమే కులాలు, మతాలు, ప్రాంతాలు, జాతులు, దేశాలు చివరికి వర్గాల వారీగా సమూహాలు, గుంపులు లేకుండా ఆరోగ్యవంతమైన, శాస్త్రీయమైన వ్యక్తి స్వేచ్ఛతో పరిపూర్ణ వ్యక్తులుగా జీవించగలుగుతారు.

చివరగా ఒక్క హరి మాత్రమే ఈ కథలో ఆదర్శవంతమైన పాత్ర. (భౌతికంగా లేకపోయినా రత్న ఆలోచనల్లో, జ్ఞాపకాల్లో) కథాపరంగా విలక్షణంగా వుండీ చర్చకు దారితీసే విధంగా వుందీ 'అద్వైతం' - కానీ కథనం మరీ క్లిష్టంగా వుండి ఒక పట్టాన అర్థం కాని విధంగా వుంది. రెండు మూడుసార్లు చదివితే గాని ఎవరు ఎవరితో యేం మాట్లాడుతున్నారో లేక ఎవరు ఎవరితో యేం వూహించుకుంటున్నారో అర్థం కాని క్లిష్టమైన శైలి. అయితే "ఇన్‌వర్టెడ్ కామాల"లోని ప్రతి మాటా అన్ని కోణాల్నుంచీ ఆలోచింపచేసేదిగా వుంది.

సమర్థించలేకపోయినా - కనీసం స్వేచ్ఛ కోసం మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తూ, జిజ్ఞాసిస్తూ, మీమాంసిస్తూ!!

- ఎ. సరళారాణి